


నెమ్మది నెమ్మదిగా జగమంతా అద్దమ రేయి నిద్దరలోకి జారింది.

ఉన్నవాళ్లూ, కడుపునిండా తిన్న వాళ్లూ, చీకూ చింతా లేనివాళ్లూ, తలుపు లన్నీ బిగించుకుని మెత్తని మంచాలమీద సుతిమెత్తని మేనువాల్చి, వెచ్చని రగ్గు లనీ, నెచ్చె నిగ్గులనీ కౌగిలిలోకి లాక్కొని, ఆ పైన పాపం అలసిపోయి, మత్తుగా కళ్ళు మూసుకుపోయి, ఒత్తిగిలి పడుకుంటే—

ఆ మంచాలు లేనివాళ్లూ, కనీసం మింగటాని కింత కంచాల్లోకి ఏమీ లేని వాళ్లూ, ఆకలి మంటకి ఆగలేక, తల్లి కడుపులోని పిల్లల్లా, ఎవరి కడుపులోకి వాళ్ళకాళ్లు లాక్కొని, తమలోకి తామే ఒదిగిపోయి, చలికి వొణికిపోయి, రాని నిద్దరని కనురెప్పలమీద రుద్దుకుంటూ పడుకున్నారు.

ఇటు వీళ్ళతోనూ, అటు వాళ్ళతోనూ సంబంధం లేనట్లు, ఆ నాలుగు గోడల మధ్యనున్న కొద్దిమంది మాత్రం ఎవరి లోకంలో వాళ్ళున్నారు.

వాయిద్యాలు మంద్రంగా మోగుతున్నాయి. దీపాలు ఎందుకో ఏడ్చి ముహం కడుకున్నట్లు కడుభారంగా వెలుగుతున్నాయి. ఒక్కొక్క టేబుల్ దగ్గర కూర్చున్న వాళ్ళంతా నడుములు విరిగిన వాళ్ళలాగా సోఫాల్లోకి వాలిపోయి, ముద్దముద్దగా మాట్లాడుతున్నారు. టేబుల్సుమీద ఖాళీ సీసాలు, గ్లాసులూ గలగలలాడుతున్నాయి. తెల్లని దుస్తుల్లోవున్న బేరర్స్ మర

బొమ్మల్లా కదులుతున్నారు. అడిగిన వన్నీ వినయంగా అందిస్తున్నారు.

సాగర్ ఒంటరిగా ఒకమూల కూర్చుని అందరివంకా పరిశీలనగా చూస్తున్నాడు. వాళ్ళంతా అక్కడికి ఎందుకు వచ్చారో తల్చుకుని, వాళ్ళ బలహీనతకి తను సానుభూతి వ్యక్తం చేసుకుంటూ, గ్లాసు పైకెత్తి సగం తాగేశాడు. సిగరెట్టు వెలిగించి పొగ పీల్చాడు.

లైట్లు ఆరిపొయ్యాయి. వెలుతురుగా సున్న డయాస్‌మీద తోకమీద నిలబడ్డ తాచుపాములా ఒక ఆడపిల్ల మిలమిలా మెరుస్తూ మెలికలు తిరిగిపోతోంది. దాన్ని ఆడిస్తున్న సంగీతం లయబద్ధంగా అందర్నీ లాలిస్తోంది. ఒంటిమీదనున్న గౌను విడిచేసి, పక్కకు విసిరేసింది. దాపరికం లేకుండా ఒంపులూ సొంపులూ అందరికీ విందుచేస్తూ, ముందుకు కదిలింది.ఒక్కొక్క వెధవనీ రెచ్చగొడుతూ పిచ్చెక్కిస్తోంది. ఒకడి వొళ్లోవాలి గుసగుసలాడింది. మరొకడి గ్లాసులోని విస్కీ తాగింది. ఇంకోడి నోట్లోని సిగరెట్టు లాక్కుంది. ఒక వయసు మళ్లిన వాడి కళ్ళజోడు లాక్కుని, వాణ్ణి కోతిని చేసి ఆడించింది.

ఆ వగలాడి సాగర్ కుర్చీ చేతిమీద కూర్చుని, అతని భుజంమీదకు వాలింది. దగ్గరగా చూస్తే దానిమొహం ఘోరంగా ఉంది. దీని రంగు కడిగిస్తే, ఇది అప్పలమ్మలా ఉంటుంది. అప్పుడు దాన్ని చూడటానికి వీళ్ళల్లో ఎంతమంది ఇంత డబ్బు ఖర్చుచేస్తారూ అని ఆలోచిస్తూనే

"యువర్ నేమ్?"

"నీలూ" అన్నది ఒక చేత్తో అతని బుగ్గలు నిమురుతూ.

"వేర్ డు యు స్టే?"

"హియర్ ఓన్లీ"

"ఐ వాంట్ టు స్పీక్ టు యు లోన్లీ..."

"ప్లీజ్ కం టుమారో..." అని మామూలుగా అందరికీ చెప్పే సమాధానం అతనికీ చెప్పి మరొకడిమీద వాలింది నీలూ.

"దీని కోతిమొహం చూడటానికి రేపు రావాలట. స్కౌండ్రల్. ఇది మగవాళ్ళందర్నీ వెధవల్ని చేసి ఆడిస్తోంది. దీన్ని చంపెయ్యాలి" అనుకుంటూ సాగర్ గ్లాసు ఎత్తి పూర్తిగా తాగేశాడు. బేరర్ వచ్చి మళ్ళీ విస్కీ, సోడా, ఐస్ ముక్కతో గ్లాసు నింపేసి వెళ్ళాడు.

నీలూ నాట్యం మొదలైంది. తన అంగాంగ ప్రదర్శనతో శివమెత్తిపోయిన దానిలా ఊగిపోతోంది. మ్యూజిక్ తారాస్థాయికి చేరుకుంది. చూస్తున్నవాళ్ళనిషా గూడా నషాళానికి అంటింది.

ఒంటిమీది ఒకటిరెండు గుడ్డపీలికలు గూడా విసిరేసి, జుట్టు విరబోసుకుని, పిచ్చిగా ఊగిపోతూ, ఈ జనానికి కైపు ఎక్కిస్తోంది.

సాగర్ మళ్ళీ రెండు గుటకలువేసి, సిగరెట్టు ఊదేస్తున్నాడు. ఈ వెర్రి వెధవలంతా ఇంత పిచ్చివాళ్ళయి దాన్ని చూడటంకోసం ఎగబడుతున్నారేం? ఏముంది దాని దగ్గర? ఇన్ని ఎముకల పోగు, వాటిపై కొన్ని కండరములు ఊగు. ఇంతేకదా?

ఎవరైనా ఒక మనిషిని మోసపుచ్చి మాయజేసినా, ఒకరి బలహీనతలనుంచి తన అవసరాలను గడుపుకునే వాళ్లన్నా సాగర్‌కు రోత. పరమ అసహ్యం. అతను ఇవాళ ఇక్కడి కొచ్చింది, ఈ మందలో కల్సిపొయ్యేందుకు కాదు... 'దీన్ని చంపెయ్యాలి ... నమ్మించి మోసగించే ప్రతి ఆడదాన్నీ నరికెయ్యాలి...'

పావుగంట తర్వాత చెవులు బద్దలు చేస్తున్న సంగీతం ఆగిపోయింది. నాట్యగత్తె పరుగుపరుగున లోపలికి పారిపోయింది. లైట్లు మళ్ళీ గుడ్డిగా వెలుగుతున్నాయి.

వర్షం కురిసి వెలిసినట్లుగా ఉంది. ఇంక అందరూ తాగటం పూర్తిచేసి తిండిమీద పడ్డారు. సాగర్‌కూడా తనకు కావల్సినవి చెప్పాడు. అక్కడున్న జనమంతా అదొక రకమైన మత్తులో నిషాలో ఊగుతున్నారు. ఈ మత్తు, ఈ నిషా కాసేపటికి దిగిపోతుంది. మగవాడ్ని బ్రతికినంతకాలమూ ఊపేసే మత్తుమందు మగువ. అసలైన నిషా స్త్రీ. వాడ్ని పిచ్చివాణ్ణి చేసి, పెంపుడు కుక్కలా తనచుట్టూ తిప్పుకుంటుంది. అవసరం తీరాక, పీల్చి పిప్పిచేశాక ఎంగిలి విస్తరాకును విసిరేసినట్లు, రోడ్డు మీదకు నెట్టేస్తుంది. వీళ్ళని పేల్చి పారెయ్యాలి...

సాగర్ ఆవేశంతో ఊగిపోతున్నాడు. లేచి తలుపు తీసుకుని లోపలికి వెళ్ళిపొయ్యాడు. పనివాళ్ళను తప్ప ఎవర్నీ లోపలికి పోనివ్వరు. అంతా ఎవరి పనిలో వాళ్ళుండగా సాగర్ చటుక్కున లోపలికి దూరాడు.

నీలూ డ్రెస్సింగ్ మిర్రర్ ముందు నిలబడి, వేషం విప్పేసి, తన మామూలు జీవితంలోకి పరకాయ ప్రవేశం చేసే ప్రయత్నంలో ఉంది. సాగర్ వెళ్ళి ఎంతో పరిచయం ఉన్నవాడిలా ఆమె చెయ్యి పట్టుకుని పోదాం రమ్మన్నాడు.

"ఎవరు నువ్వు." అని అడిగింది గాభరాగా,

"నే నెవరయితే నీకేంగాని, నీ క్కావల్సిన డబ్బు ఇస్తాను రా..."

"నేను రాను, వదులూ" అని గింజుకుంటూ కేకలు పెట్టింది. లోపలినుంచి నలుగురు పనివాళ్ళు గబగబా పరుగెత్తుకొచ్చి, సాగర్‌ను బయటకు తరుము కొచ్చారు. సాగర్ కోపంగా తిట్టుకుంటూ కౌంటర్‌లో ఒక వంద కాగితం

పారేసి, వెనక్కి తిరిగి చూడకుండా వచ్చి కార్లో కూర్చున్నాడు.

పొడుగ్గా, వెల్సిపోయిన రిబ్బను ముక్కలా ఉన్న సిమెంటు రోడ్డు కారు చక్రాల క్రిందికి గిర్రున చుట్టుకు పోతోంది. నిర్మానుష్యంగా వున్న రోడ్డు మీద, మున్సిపాలిటీవాళ్ళు ఒక్కో లైటు స్తంభానికి ఒక్కో చంద్రుణ్ణి ఉరి దీశారు. ఆ దృశ్యాన్ని చూసి భయపడి కాబోలు, చలిగాలి విసురుగా లోపలికి దూసుకొచ్చి, అతన్ని కావలించేసు కుంటోంది.

కడుపులో ఎలుకలు తవ్వుతున్నాయి. అక్కడే ఏదైనా తినాల్సింది. దీని గొడ వలోపడి ఆ మాటే మర్చిపొయ్యాడు. కడుపులో సన్నగా ఆకలి మంట... గుండెల్లోనూ మంట రగులుతూనే ఉంది. గత ఏడాదిగా దానిముందు ఈ ఆకలి మంట ఎంత ? ఆడది అంటే, వ్యసనా లన్నిటిలోకీ బహుచెడ్డది.

ఎక్కుపెట్టి విడిచిన బాణంలా దూసుకుపోతున్న కారు కీచుమంటూ ఆగిపోయింది. అతని ఆలోచనలకూ సడెన్ బ్రేక్ పడింది. పది గజాలు వెనక్కి వచ్చి ఆగింది కారు.

బస్ స్టాప్‌లో ఎవరో ఆడది...అర్థ రాత్రిపూట, ఒక్కతే, చీకట్లో, చలిలో ఇక్కడ నిలబడి ఎదురు చూస్తోంది. దేనికోసం? ఈ వేళప్పుడు దీనికోసం దీని తాత ఎవడు బస్సు తీసుకొస్తాడని? ఎవ్వని కోసమీ జవ్వని నిరీక్షణ ?—

"ఏయ్, కమిన్" అని అరిచి, కారు తలుపు తెరిచాడు సాగర్. పిలవగానే, పదేళ్ళు తనతో కాపరంచేసిన పెళ్ళం లాగా, చొరవగా వచ్చి అతని పక్కన కూర్చుంది. ఆమెమీదనుంచి వొంగి, తలుపు దగ్గరకి లాగాడు. ఆ ప్రయ త్నంలో, అప్రయత్నంగానే ఆమె రొమ్ములు, అతని చేతికి మెత్తగా తగి లాయి. మోహంలోకి చూశాడు. చామన




ఛాయగా ఉన్నా, మగువ మోము చూడ వేడుకగానే ఉంది. అయస్కాంతానికి ఇనుప ముక్కను దగ్గరకు లాక్కోమని ఒకరు చెప్పక్కర్లేదు. ఆమె భుజం అతని భుజానికి తగులుతోంది. ఏ భాష లోనూ స్పష్టంగా చెప్పలేని భావాలను ఆమె కళ్ళు క్షణంలో చెప్పాయి. స్త్రీ సిగ్గుపడుతూ, చిరునవ్వు నవ్వితే, ఇంక మగవాడిదే ఆలస్యమన్నమాట.

కారుకు మళ్ళీ చలనం వచ్చింది. ఆగిపోయిన అతని ఆలోచనలకీ కాళ్ల వచ్చాయి.

"నీ పేరు?" సాగర్ దృష్టి రోడ్డు మీదనే ఉంది. ఆమె దృష్టి అతని మీదనే ఉంది.

"అనసూయ" అన్నది కొంచెం బొంగురు గొంతుకతో.

'అనసూయ ! నిప్పు, నీళ్లు అక్కర్లేకుండా, పాతివ్రత్యంతో ఇనుపగుగ్గిళ్ల వండేస్తుంది'... గాస్ పొయ్యిమీద బియ్యపు గుగ్గిళ్ళు వండి, నిజభర్తలకు తిండిపెట్టడం చేతగాని అనసూయలకీ, అరుంధతులకు కొదవలేని భరతభూమి.. స్వగతం నోరునొక్కి అనసూయను అడిగాడు. "ఎక్కడ ఉంటున్నావు?" అని.

"ఆనందనగర్ అండీ" అన్నది చిరునవ్వుతో.

'సరి, సరి. నీవున్న నెలవే ఆనంద నగరం'..."లేటయిందేమి?"

ఆ ప్రశ్నకు అనసూయ చెప్పిన జవాబు- "మా వాళ్ళ ఇంట్లో పెళ్ళయితే వెళ్ళాను..."

'దీని బొంద. దీని పెళ్ళికి వారమూ లేదు, వర్జమూ లేదు. రోజుకో పెళ్ళి. గంటకో మొగుడూను ... ఆడదానివి పాపం అవస్తపడిపోతావని, భగవం తుడు జాలిపడి, పెట్టుబడిలేని వ్యాపారం చేసుకుని పొట్టపోసుకోమని, ఆడదానికి అందాన్ని ఇచ్చాడు...' సాగర్ మన సులోని మనిషి, మనసుకు చెబు తున్నాడు.

అనసూయ చెప్పుకుపోతోంది. "ఫంక్షను లేటయిపోయిందండీ. ఒక్క దాన్నీ మిగిలిపొయ్యాను. ఏం చెయ్యను? ఏ ఆటోలోనో ఇంటి కెళ్దామంటే, ఒక్క దాన్నీ చేసి ఎటు తీసుకుపోతాడోనని భయం".

'నీ కెందుకే భయం? ఆటోవాడి జేబులోని డబ్బులు నువ్వు లాక్కుని, నీ ఒంట్లోని జబ్బులు వాడి ఎకవుంట్ కి ట్రాన్స్‌ఫర్ చేయగలదానివి గనుక

నిన్ను చూసి వాడు భయపడాలి గాని...'

"ఇంతలో దేవుడిలా మీరు కనిపించారు" అని నవ్వింది అనసూయ.

'నవ్వకు. ఆడది నవ్వినా, పాము పడగ విప్పి ఆడినా, తప్పుకుపోతేనే, ముప్పు తప్పుతుంది. లేదా, విషం కక్కుతుంది. ఈ అందమైన చిరునవ్వుల పందిరిక్రిందే తను మూడేళ్ళు మూడు నిముషాల్లా గడిపాడు. ఆదమరిచి నిద్రపోతే, గుండెలమీద ఫెళ్లున తన్నేసి... డర్టీ గూస్...'

కారు పెద్దగేటులోనుంచి దూసుకుని వచ్చి గారేజ్‌లో ఆగింది. సాగర్‌తో పాటు ఆమెగూడా కారు దిగింది. చుట్టూ చూస్తూ, పెద్ద చేపకే గాలం తగులుకున్నదని తలుచుకుంటూ "మీకు శ్రమ ఇస్తున్నాను" అన్నది మర్యాదకి భంగంలేకుండా.

అతనీ ఎటికసీస్ గురించి ఆలోచించే స్థితిలో లేడు. దీన్ని చంపెయ్యాలి.

'నీకు ఈ వేళ్టితో నూకలు నిండాయిలే, రా' అనుకుంటూ పైకి మాత్రం "నావెంట పైకి రా" అన్నాడు.

అతని వెనకనే ఆమెగూడా గదిలోకి వెళ్ళింది. తలుపు దగ్గరగా వేసి అతన్ని బల్లిలా కరుచుకుంది. సాగర్ అంతులేని అసహ్యంతో ఆమెను వెనక్కి నెట్టేశాడు. చూస్తుండగానే అతని కళ్ళల్లో నిప్పులు రగులుకుంటున్నయి. కసితో పళ్ళు ఒరుసుకుంటున్నయి.

"చెప్పు, ఎందుకిలా తయారయ్యావు?" అని నిలదీసి, అడిగితే బిత్తరపోయింది అనసూయ.

"ఏంచేశాను?" అని అమాయకంగా అడిగింది అనసూయ.

"నాటకాలు ఆడతావుటే? జీవితాలతో చెలగాటా లాడతావుటే పాపిష్టిముండా?" అని అనసూయ గొంతు పట్టుకుని రెండు చేతుల మధ్య బిగించి నొక్కటం మొదలుపెట్టాడు.

'వీడెవడో పిచ్చోడిలా ఉన్నాడని' అనసూయ గుంజుకుని, చేతులుకొరికి, గోళ్ళతో రక్కి, అతని పట్టునుంచి విడిపించుకుని ఒక్క పరుగున బయటపడి, క్రిందికి వచ్చింది, ఏడుస్తూ, బూతులు తిడుతూ.

మెట్లు దిగగానే ఆమెకు ఒక తల నెరిసిన పెద్దమనిషి కనపడ్డాడు. ఈయనగూడా తనమీద పడతాడేమోనని భయపడి, ముందుకీ, వెనక్కీ కదల్లేక శిల్పంలా నిలబడిపోయిన అనసూయతో ఆ ముసలాయన అన్నాడు.

"వాణ్ణి తిట్టకు తల్లీ. వాడలా పిచ్చివాడై పోవటానికి కారణం, నీలాంటి మరో ఆడది..."

అనసూయ కన్నీళ్ళు తుడుచుకుని ఆశ్చర్యంగా చూసింది. "మమ్మల్ని ఆడిపోసుకుంటారుగాని, మా పరిస్థితుల్ని ఎవరు అర్థం చేసుకుంటారు? ఈ వృత్తిలో అడుగు అడుగునా నరకమే. చావలేక బ్రతుకుతున్నాం. నిజంగానే నండీ, చావలేకనే ఈ బ్రతుకు బ్రతకటం..."

"కూటికి లేక, మరో దారిలేక, ఇందుకు సిద్ధపడితే, కొంత అర్థంఉంది. కానీ అన్నీ ఉండీ, పువ్వుల్లో పెట్టి చూసుకునే భర్త ఉండీ, నీచానికి దిగజారిన వాళ్ళను ఎవరుమాత్రం ఎందుకు క్షమిస్తారు?" అది ఆమెను అడిగిన ప్రశ్నో, స్వగతంగా చెప్పుకున్న విషయమో తెలియలేదు.

"అలాంటి భర్త లభిస్తే కాలదన్నుకుని, ఈ దౌర్భాగ్యపు జీవితాన్ని వరించే మూర్ఖులు ఎవరుంటారు?"

"ఉన్నారు కాబట్టే ఈ ఘోష, ఇంత కంఠశోష. దాని సంగీతానికి ముగ్ధుడైపోయి, రూపానికి మురిసిపోయి, ముందు వెనుకలు విచారించకుండా, తెచ్చి అందలం ఎక్కించాడు. గులాబీ కొమ్మను వాడిముళ్ళు ఉంటాయనీ, మొగలి పొదలో బుసకొట్టే పాములుంటాయనీ, అందమైన ఆడదాని మనసులోనూ బోలెడన్ని దుర్బుద్ధులుంటాయనీ ఎరగని పసివాడు మావాడు. ఆ అమాయకత్వానికి శిక్ష, ఇప్పుడు అనుభవిస్తున్న ఆ మానసిక క్షోభ. వాడి మనసే వాడికొక చెరసాలకాగా, అందుకు కారణమైన సంగీత కనిపించక, కనిపించిన వాళ్ళందరిమీదా కక్షగట్టి, కసి తీర్చుకుంటున్నాడు...అంతేగాని ఇందులో నీ తప్పేంలేదు. నీకు జరిగిన అవమానానికి తగిన పరిహారం నేను ఇచ్చుకుంటాను. పట్టుకెళ్ళు..."

అనసూయకు డబ్బు ఇచ్చి ఆమెను పంపించాడు కామేశ్వరరావుగారు. ఈ మధ్య ఇలా కొడుకు చేస్తున్న పనులు ఆయన మనసును రంపపుకోత కోస్తున్నయి. తన కోడలు లేచిపోయిన రోజునే కామేశ్వరరావుగారు సగం చచ్చిపొయ్యాడు. ఆ మిగిలిన సగం ప్రాణం తోటీ, కొడుకు అనుభవిస్తున్న చిత్రహింస చూడలేక యమ యాతన పడుతున్నా డా ముసలాయన. ఆ రోజున తను తొందరపడి అన్ని మాటలు అని ఉండకపోతే...భగవంతుడా, తప్పు చేయగూడదని చెప్పటమూ తప్పే అయితే...

సాయంత్రాల పూట సాగర్, సంగీత, బాబు తోటలో తిరుగుతూ. సంతోషంగా కేరింతలు కొడుతూ, కాలక్షేపం చేస్తుంటే, వాళ్ళను చూస్తూ ఉండటమే తనకు నేత్రపర్వంగా ఉండేది. వాళ్ళు కలకాలమూ అలాగే ఉండాలని కోరుకోవటం అత్యాస అవుతుందనుకోలేదు.

ఎక్కడో సంగీత కచేరీలు చేసుకునే పిల్లను తెచ్చి, ఇంటి కోడల్ని చేస్తానని సాగర్ అంటే మొదట కామేశ్వరరావుగారు ఇష్టపడలేదు. కట్న కానుకలు




తేలేదని గాదు. ఆ పిల్ల గుణగణాలు, గత చరిత్ర ఎలాంటివో తెల్సుకోకుండా, కేవలం సంగీతానికే భ్రమిసిపోతే ఎలా? గొంతెత్తి పాడుతున్న ఆ కాసేపు మైమరిచిపోయేలా చేసినా, అంతమాత్రాన కళ్ళు మూసుకుపోతే ఎలా? ఎన్ని చెప్పినా, వాణ్ణి ఆమె లొంగదీసుకుంది. వాడు సంగీతను చేసుకోవటానికి పట్టు పట్టినకొద్దీ, కొడుకు మాట కాదనలేక తన పట్టుదల సడలించాడు.

సంగీత ఇంటికోడలై వచ్చినదగ్గరి నుంచీ, ఆమెను కోడలులా కాదు, కన్న కూతురులానే చూసుకున్నాడు. కనుకనే ఎన్నో విషయాలు చిలకకు చెప్పినట్లు చెబుతూ వచ్చాడు. పెళ్ళికి ముందు అబ్బాయికీ అమ్మాయికీ ఒకరిమీద మరొకరికి ఉండేది వట్టి వ్యామోహమేనని, అప్పుడుండే తొందర అంతా దేహానిదేనని, మూడుముళ్లు పడినాకనే మనసులు ఒకటయ్యేదనీ, కనుక పెళ్ళితో ప్రేమ పూర్తయిపోగూడదనీ, నిజానికి అక్కడి నుంచి అసలైన ప్రేమ అరంభం కావాలనీ రోజూ పాఠాలు చెప్పేవాడు. కానీ చివరకు చెప్పినదంతా గాలికి కొట్టుకుపోయింది. తాను చెయ్యదల్చుకున్నదేదో చేసి చూపించింది. ఫలితం? ... తన బ్రతుకును కాల్చి మసిచేసుకుంది. వాడి బ్రతుకునిండా కసి నింపేసింది... దేనికీ మూర్ఖత్వం? తనకేం తక్కువైందని?

మేడమీద బాల్కనీలో కూర్చుని, సామ్రాజ్యాలను పోగొట్టుకుని అడవుల పాలైన చక్రవర్తిలా లక్ష్యరహితంగా శూన్యంలోకి చూస్తున్న కొడుకు దగ్గరకు వచ్చారు కామేశ్వరరావుగారు. సాగర్ కుర్చీచుట్టూ సిగరెట్టు పీకలు, కాల్చి పారేసిన అమూల్యమైన క్షణాల తాలుకు నుసి, కళ్ళల్లో వేలాడే గత జ్ఞాపకాల డోర్ కర్టెన్లనిండా, బాధ వర్షంలా కురిసి, చినుకుల్లా, కనుకొలకుల్లోనుంచి కారుతోంది.

సాగర్ ఏడుస్తున్నాడు. కామేశ్వరరావుగారి ప్రాణం గిలగిలలాడిపోయింది. దగ్గరగా కూర్చుని హితబోధ చేశాడు.

"చూడు చిన్నా, మనం అనుకున్న దానికీ, జరగనున్నదానికీ మధ్య ఒక్కోసారి అంతులేని అగాధం ఏర్పడుతుంది. చేతనైతే దాన్ని దాటి ముందుకు పోవాలి, పోనీ ఆ ప్రయత్నం చేద్దామన్నా కోడలు ఎక్కడుందో, ఎలా ఉందో మనకు తెలియదు. పసివాడినైనా వదిలేసి వెళ్ళిందికాదు. ఏడాదిపైన అయింది. ఇంక తిరిగి వస్తుందన్న ఆశా లేదు. అలాటి కృతఘ్నురాలికోసం, నువ్వెందు కిలా కుమిలిపోవాలి? ఈ చీకట్లో నువ్వెందుకు కొట్టుమిట్టాడాలి? నీకు నేను మళ్ళీ పెళ్ళిచేస్తాను, చిన్నా..." అన్నారాయన ఆవేశంగా.

సాగర్ నెమ్మదిగా కళ్ళుతిప్పి తండ్రి వంక చూశాడు. "చూడండి, నాన్నగారూ. రాత్రి కొంచెం ఎక్కువగా విస్కీ పుచ్చుకున్నామనుకోండి. ఆ పుచ్చుకున్నప్పటి నిషా అలా ఉండి, మర్నాడు గూడా 'హేంగోవర్' ఉంటుంది గదా. విస్కీకన్నా గొప్ప మత్తునీ, కిక్కునీ ఇచ్చే సంగీతను మూడేళ్ళపాటు అమితంగా ప్రేమించాను. గుడ్డిగా ఆరాధించాను. తను కనపడకపోతే ఒక్కక్షణం ఉండలేని పసివాడినే అయినాను. మరి ఈ 'హేంగోవర్' ఇంత తొందరగా వదులుతుందా? అదీగాక, ఇప్పుడు మరో ఆడదాని గురించి ఆలోచించే స్థితిలో లేను నేను...తాను మోసంచేసింది. అప్పారావు తన గురువు అంది. ఆమె చెప్పిన వాటి అన్నిటితోపాటు ఇదీ నమ్మాను. కానీ వాడు కొంపలు కూల్చే త్రాష్టపు ముండాకొడుకని తెలిస్తే గుమ్మంలోకిగూడా రానిచ్చేవాణ్ణి కాదు. ఎక్కడున్నారో తెలిస్తే, ఆ అప్పిగాడి పెళ్ళాన్నీ, పిల్లనీ పావుగంటకు పావలాకి అమ్మి, ఆ పావలాతో వాణ్ణి పూడ్చిపెట్టి, ఆపైన నా సొంత డబ్బుతో వాడి గోరీ కట్టిస్తాను..." అని ఆవేశంగా అన్నాడు సాగర్. అతని వంట్లోని రక్తమంతామొహంలోకిపొంగి, కందగడ్డలా అయింది.

ఇంక అతన్ని రెచ్చగొట్టటం ఇష్టం లేక కామేశ్వరరావుగారు క్రిందికివచ్చారు. కోడలు ఇంట్లోనుంచి పారిపోవటానికి అప్పారావు ఒక్కడే కారణమని వాడు అనుకుంటున్నాడు. వాణ్ణి అలా అనుకోనివ్వటమే మేలు. ఆ రోజు తానలా తొందరపడి ఉండకపోతే, సంగీత ఈ పని చేసి ఉండేదికాదేమో. ఒకరకంగా తనూ అందుకు దోహదంచేశాడు.

కోడలు ఫోటోదగ్గర నిలబడి ఆమెతో ఆయన అన్నాడు. "నువ్వులేని ఈ భవనం, ఈ బ్రతుకులూ ఎంత నిర్జీవంగా ఉన్నాయో, ఒక్కసారి చూడటానికైనా, రావా సంగీతా? అసలెక్కడున్నావు నువ్వు?" అని వాపోయాడు.

ఆమె వాళ్ళకు కొన్ని వందలమైళ్ల దూరాన సాగరతీరాన ఒంటరిగా, నిరామయంగా, దీనంగా చూస్తూ కూర్చున్నది. ఆకాశంమీద మబ్బులు విచారంగా కదులుతుంటే, ఆమె మొహంమీద విచారం మబ్బుల్లా కదులుతున్నది. బీచ్‌లో ఆమెచుట్టూ కొన్ని వందల మంది ఆనందంగా కదులుతున్నారు. పిల్లలు కోలాహలంగా అరుస్తున్నారు. బాబుగూడా వాళ్లలోచేరి ఆడుకుంటున్నాడు.

దూరంగా నింగి వంగి సముద్రానికి అడ్డంగా నిలబడ్డచోట కదలికి కదలికా లేదు, ఈ మిడిసిపడే, ఎగిసిపడే కెరటాలూ లేవు. ఈ అంచునే అసమర్థుని కోపావేశాల్లాగా అలలు ఎగిరిపడుతున్నయి.

ఇప్పుడు తనపక్కన ఆయన ఉంటే ఆతీరే వేరుగా ఉండేది. ఉన్నా, లేకున్నా ఆయన పక్కన ఉన్న ధైర్యం, తృప్తి చాలు, ధీమాగా బ్రతకటానికి. ఇప్పుడే ముందని? ఏమీ లేకపోవటం ఒక ఎత్తు, అనుక్షణం, అడుగడుగునా తనను పక్కకు లాగాలిని చూసే పెద్దమనుష్యులను తప్పించుకు తిరగటం ఒక ఎత్తూ అవుతున్నది.

తాను ఇలా వచ్చేయటం ఎంత తప్పో తెల్సు. వచ్చి ఇక్కడ తవ్వి తల కెత్తుకునే సిరిసంపదలేవీ లేవనీ తెల్సు. కానీ ఇంక అక్కడ ఒక్క క్షణంకూడా ఉండడం దుర్భరమైపోయింది.

కాలం మనకోసం రేపు ఏ ఉపద్రవం తెచ్చిపెట్టబోతోందో, లేక ఏ భోగభాగ్యాలు అందివ్వబోతోందో ముందుగా తెలియదుకదా. తెల్సినదాన్నిబట్టి, ఎవరికి వీలుగా వాళ్లు అప్పటి అవసరాలనుబట్టి మసులుకుంటారు. కానీ ఒక్కోసారి మనం తెలివిగా చేసిన పనులే, మనల్ని తెలివితక్కువవాళ్లని చేస్తుంటయి. నేటి అవసరంకొద్దీ చేసిన పనే, రేపటి భవిష్యత్తుకు అపకారం చేస్తే తానేం చేయగలదు?

మొదట్లో తనకు అప్పారావును మించిన మనిషి దొరకలేదు. తనకు సంగీతం నేర్పాడు. కచేరీలు చేయించాడు. రేడియోల్లో పాడించాడు. పదిమంది పెద్దలకు పరిచయం చేశాడు. ఇవన్నీ చేస్తూ తనమీద హక్కు సంపాదించాడు. నిజమే, తనమీద హక్కు సంపాదించినట్లుగానే అప్పట్లో ప్రవర్తించాడు.

తర్వాత సాగర్ ఒక సంగీత కచేరీలో పరిచయం అయ్యాడు. ఆ పరిచయం పెరుగుతూ వచ్చింది. తన కచేరీ ఎక్కడ ఉన్నా వినటానికి వచ్చేవాడు. రాను రాను క్రమంగా ఇంటికే రావటం మొదలుపెట్టాడు. మరికొంచెం చనువుపెరిగి తమ ఇంటికే తీసుకువెళ్ళి, తనచేత పాటలు పాడించుకుని పరవశించిపోయేవాడు.

ఆయనకు అన్నీ ఉన్నయి. ఆస్తిపాస్తులతోపాటు సహృదయమూ, సౌశీల్యమూగూడా ఉన్నయి. లేనిదల్లా ఆడతోడు. అంటే ఆయనను వరించివచ్చే కన్యారత్నాలు కరువైనారని కాదు. ఆయన సంపదను మాత్రమే ప్రేమించే ఆ ఆడపిల్లల్ని ఎవర్నీ ఆయన ప్రేమించలేనని చెప్పారు. అందుకే తమ బంధువుల్లో కాకుండా, ఒక పరాయి పిల్లను, బీదరాలినీ చేసుకుంటే, ఆ పిల్లకు ప్రేమ, అంతకు మించిన కృతజ్ఞతాభావం మెండుగా ఉండి, తనను కంటికి రెప్పలా చూసుకుంటుందిట. వీటన్నిటినీ మించి ఆ మేడమీద గదిలో ఆయనముందు కూర్చుని తను పాడుతూ ఉంటే చాలుట. ఆ పాట వింటూ ఎన్నియుగాలైనా, క్షణాల్లా గడిపెయ్యవచ్చునట. నిశ్చింతగా తన ఒడిలో తల పెట్టుకుని నిద్రపోవటంకన్నా గొప్ప అదృష్టం లేదుట. ఎన్ని కలలు, ఈ అలల్లా ఒకదాన్ని తరుముకుంటూ మరొకటి ముందుకు వచ్చేవనీ!

తనకోసం పసిపిల్లవాడిలా పరితపించిపోయే ఆయన్ని నిరాకరించలేకపోయింది. అదీగాక తనూ జీవితంలో స్థిరపడాలనుకోవటం పెద్ద అపరాధమేమీ కాదుగదా! అప్పారావును కాదని ఆయన చేతిని అందుకుంది. ఆయనతో పాటు అందలం ఎక్కింది.

మనిషిని గతం నీడలా వెన్నంటే ఉంటుంది. మరి, మన నీడను, మననుంచి నరికేసుకోవటం సాధ్యమేనా ? ఏమో, ధనమూ బలమూ ఉన్నవాళ్లకు అప్పిగాడిలాంటి చీడపురుగుల్ని... అప్పటికే అప్పారావుగారు అప్పిగాడై, అప్పిగాడు చీడపురుగూ అయిపోయినాడు. ఈ చీడపురుగు నెమ్మదిగా తన సంతోషాన్ని కొరికెయ్యసాగాడు. ఏదో సాకుపెట్టుకుని నెమ్మదిగా తయారయ్యేవాడు. ఆయనముందు అప్పారావుగారు తన గురువుగారని పొగిడినా, ఆయన లేనప్పుడు, ఇంక తన ఇంటికి రావద్దని మందలించేది. కానీ ఒక్కసారి ఆడది చనువిస్తే, ఇంక ఆ మగవాడి అధార్టీకి అంతు ఉండదు.

ఇది ఇలా ఉండగా మామగారు అడుగు అడుగునా తనని శల్య పరీక్ష చేస్తూనే ఉన్నాడు. తమ గొప్పదనం గురించీ, కీర్తిప్రతిష్ఠల గురించీ ఆయన అనుక్షణం గుర్తుచేస్తూ తనను న్యూనత పరుస్తూనే వచ్చాడు. మూడేళ్లపాటు ఆ ఇంటికోడలు హోదాలో తను ఉన్నా, ఆయన్ను చూస్తూన్నప్పుడల్లా తను కృంగిపోతూనే వచ్చింది.

ఏదో వారి దయతో తాను ఆ మేడ మెట్లు ఎక్కగలుగుతున్నానని ప్రతి రోజూ గుర్తుచేసే మామగారి మధ్య, ఎప్పుడు సందు దొరుకుతుందా అని ఎదురుచూసేఅప్పిగాడిమధ్య, నిర్మలంగా నమ్మి, నిశ్చింతగా తన గుండెలమీద పడుకుని నిద్రపోయే భర్త మధ్య—తాను ఎంతో మానసిక క్షోభను అనుభవించింది. ఎంతకని నటించటం? నమ్మినవాళ్ళని ఎన్నాళ్ళని మోసగించటం? ఏదో ఒక రోజు...

ఆ రోజు రానే వచ్చింది. ఎన్నడూ మేడమెట్లు ఎక్కని మామగారు పైకి రావటంతో తాను పాతాళానికి పడిపోయింది. అప్పిగాడితో దొరికిపోయింది.

అది చూశాక ఆయన గుండెల్లో భగ్గున మంట రగలటంలో వింతేముంది? ఆ మండే గుండెలతో ఆయన అప్పిగాడ్ని తిట్టాడు. తనను కొట్టాడు. భరించలేక ఇంట్లోనుంచి వెళ్ళిపొయ్యాడు.

అయిపోయింది. తన నాటకానికి చరమాంకం పూర్తియిపోయింది.ఇంక ఈ ఇంట్లో తన స్థానం ఏమిటి ? తన 'మొహం వీళ్ళకెలా చూపిస్తుంది? ఇంత ద్రోహం చేశాక ఇంకా వాళ్ళ తిండి తింటూ, వాళ్ళ ఇంట్లో ఎలా ఉంటుంది, మానాభిమానాలు గల ఏ మనిషి అయినా:

మళ్ళీ వాళ్ళు తిరిగి వచ్చేటప్పటికే, అప్పిగాడితో తను పరారీ అయిపోయింది. అయితే ఈ తొందరలో, ఆలోచనలేని పని మరొకటి చేసింది. అది బాబును తనతో తీసుకుని వచ్చేయటం.

వీడు తనకాళ్ళను చుట్టుకుని మమతాను బంధంతో పట్టెయ్యకపోతే, నిజానికి ఇంక తాను బ్రతికి ఉండాల్సిన అవసరం ఏముంది ? జీవచ్ఛవంలా రోజులు వెళ్ళదీయాల్సిన పనేముంది?

ఇక్కడికి వచ్చాక అప్పిగాడు తనకేవో సినిమా ఛాన్సులు ఇప్పిస్తానని ఎవరెవరి దగ్గరకో తీసుకెళ్ళి వాళ్ళకు



అప్పగించి రావటం మొదలుపెట్టాడు. తన బ్రతుకును మరింత కలుషితం చేయటంకన్న ఈ అప్పిగాడివల్ల దొరికేదేమీలేదని, నిజానికి వాడికేమీ చేతకాదని, తనముందు ప్రగల్భాలు పలకటం మినహా, గడపదాటితే వీడి మొహం చూసే వాళ్లెవరూ లేరని తొందరలోనే తెల్సుకుంది. వెంటనే వాణ్ణి తరిమేసిందిగూడా.

మరి ఇన్నాళ్ళనుంచీ తాను ఎలా బ్రతుకుతోంది అన్న ఆలోచన వచ్చినప్పుడల్లా వెనువెంటనే సమాధానంగా మరో ప్రశ్న ఉదయిస్తుంది, అదీ ఒక బ్రతుకేనా అని.

అప్పటికి బాగా చీకటిపడిపోయింది. జనమంతా ఎటువాళ్ళు అటు వెళ్ళిపొయ్యారు. బాబు పిచ్చుకగూళ్ళు కట్టటంతో, పడగొట్టడంతో అలసిపోయి, వచ్చి తల్లి వొళ్ళో వాలాడు. ఊహా విహంగాలమీద ఎక్కడో విహరిస్తున్న ఆమెను ఈ లోకంలోకి తీసుకొచ్చాడు.

"అమ్మా, అంతా నల్లగా ఉంది. ఏమీ కనపత్తంలేదు" అని ఫిర్యాదు చేశాడు వాడు.

"అంతే బాబూ. వెలుగు ఎప్పుడూ ఉండదు. ఉండగూడదు. వెలుగును తరుముకుంటూ చీకటి వస్తూనేఉంటుంది. ఈ మనుష్యులందరికీ చీకటంటే భయం. అందుకే ఇందాక ఉన్న మనుష్యులందరూ చీకటి పడగానే, వెలుగును వెతుక్కుంటూ ఎక్కడి వాళ్ళక్కడ లేచి పొయ్యారు. కానీ వొరేయ్ బాబూ, మనం ఎంతదూరం పారిపోయినా, ఆ సమయం వచ్చేటప్పటికి చీకటి వచ్చి చుట్టుముట్టేస్తుందిరా, తప్పదు..."

"అమ్మా, మరీ ఆ మోత ఏంటి?"

"అదా, అది సాగర సంగీతంరా. కానీ ఇప్పుడు ఆ సముద్రం గుండె పగిలేలాగా ఏడుస్తోందిరా."

"...ఎంతుకూ?"

"అందుకే బాబూ, ఇన్నాళ్లా దాన్ని ఎందుకేడుస్తున్నావని అడిగేవాళ్ళయినా ఎవరూ లేనందుకే బాబూ అంత ఘోష పడుతున్నది. దాని బాధ ఎవరితో చెప్పుకుంటుంది?"

"ఏంటీ బాద?"

"దాని కడుపులో పురుగులురా. జలచరాలు పొట్టలోని నరాల్ని మెలితిప్పుతుంటే, ఓర్చుకోలేక, చచ్చేట్టు అరుస్తోంది..."

"మరీ, మందు ఇద్దాం, డాట్టారు దగ్గరకెళ్ళి..."

"అది మందు తీసుకోనంటోందిరా. అసలు ఇక్కడ ఉండనంటోంది. భూమిలోకి ఇంకిపోతానంటోంది. లేదా ఆవిరై

ఆకాశానికి ఎగిరిపోతానంటోంది..." అని వెక్కి వెక్కి ఏడ్చింది సంగీత.

బాబు బిక్కచచ్చిపొయ్యాడు. వాడికీ ఏడుపొచ్చింది. ఏడుస్తూనే అడిగాడు. "ఎంతుకమ్మా నువ్వు ఏలుత్తున్నావు?"

"ఇంకా ఏం చెప్పనురా! చెప్పాను గదరా ఎందుకేడుస్తున్నానో..." అని బావురుమంది.

పసివాణ్ణి కావలించుకుని ఆమె, ఆమె మెడను వాటేసుకుని వాడూ ఇద్దరూ గుండెలవిసి పొయ్యేలా ఏడ్చారు.

కాసేపటికి కాలం వాళ్ళ కన్నీళ్ళు తుడిచి, ఇంటికి సాగనంపింది.

తను చేసింది తప్పేనని సంగీత ఒప్పుకుంటోంది. అయితే అందుకు కారణమైన పరిస్థితులను గూడా ఆలోచించాలిగదా—అని ఆమె వాదం. వినేవాళ్లెవరు?

మామగారు ఒక తరం వెనకటి మనిషి. మొండి మనిషి. తనంటే, ఆయనకు ఇష్టంలేకపోవచ్చు. ఇలాంటి అవకాశం కోసమే ఇదురుచూస్తూ ఉండి వచ్చు. తన అడ్డు తొలగితే, ఆయనకు మళ్ళీ పెళ్లిచేసే ప్రయత్నమూ చేయవచ్చు.

కానీ తన భర్త సంగతివేరు. సాగర్‌కు తనంటే ప్రాణం. బాబు అంటే అంతకన్నా ఎక్కువ. తననీ, బాబునీ వదిలేసి ఆయన ఒక్కరోజయినా ఉండ లేరని తెల్సి, తాను సంవత్సరానికి పైగా దూరమైంది.

తనకిప్పుడు మామగారి భోగ భాగ్యాలు అక్కర్లేదు. అలాగే వారి అవమానాలూ అక్కర్లేదు. సాగర్ తిరిగి తనకు దగ్గరయితే చాలు. ఆయనతో కల్సి పస్తులుండటం గూడా సంతోషమే. అసలు తన మొండితనంతో ఇన్నాళ్లూ అశ్రద్ధచేసిందిగాని, ఒక్క ఉత్తరం ముక్క రాస్తే ఆయన వచ్చి తనవాళ్లో వాలకపోయినారా, కౌగిట్లో కరగకపోయినారా? ఎంతటికోపం వచ్చినా, మూడేళ్ళ అనుబంధం మాటేమిటి?

మర్నాడే ఉత్తరం రాసి పడేసింది, సంగీత. అందులో ఒక్కటే వాక్యం. బాబు మీకోసం బెంగపెట్టుకున్నాడు గనుక ఒక్కసారి వచ్చి చూసిపొండి అని రాసింది. క్రింద తన అడ్రసు రాసింది.

ఆ ఉత్తరం చూడగానే సాగర్‌కు మళ్ళీ పూనకం వచ్చింది. దాన్నీ, అప్పిగాణ్ణీ చంపి పాతరేస్తానని, రివాల్వర్ తీసుకున్నాడు.

కామేశ్వరరావుగారే అడ్డుపడ్డాడు "చిన్నా, నువ్వు వెళ్ళటానికి వీల్లేదు. పైకి కనిపించకుండా అది నీ గుండెల్లో కత్తిపోటు పొడిచినా, దాన్ని చంపి పగ తీర్చుకునే అధికారం మనకు లేదు. అసలు అంతవరకు రానివ్వకుండా ముందే జాగ్రత్తపడవల్సింది. ఇప్పుడు చూడు, దాన్ని వదిలిపెట్టి ఉండనూ లేము. మునుపటిలా తెచ్చి నెత్తిమీద పెట్టుకోనూలేము... మీరు ప్రేమించి పెళ్ళి చేసుకుంటానంటే, నాకు అభ్యంతరం లేదురా. ఎవతో దారిన పొయ్యే చపలమైన వాళ్ళందర్నీ నెత్తిన పెట్టుకుంటే చూడు ఏమైందో? అది సుఖపడిందా, నిన్ను సుఖపడనిచ్చిందా?... సరే, గతాన్ని తవ్వుకుంటూ కూర్చుంటే, భవిష్యత్తు ఏంగాను? లోకం ఏమనుకుంటే మనకేం? దాన్ని విడిచి నువ్వు బ్రతకలేవు, నిన్ను విడిచి నేనూ ఉండలేను. కనుక దాన్ని తీసుకొస్తాను. ఇకనుంచైనా జాగ్రత్తగా ఉంచుకునే ప్రయత్నం చెయ్యి..." అని గద్దించారు.

అప్పటికప్పుడే డ్రైవర్‌ను పిలిచి కారు సిద్ధం చేయమన్నారు.

ఉత్తరం రాసిన మరుక్షణంనుంచి సంగీత ఎదురుచూస్తూనే ఉంది భర్త కోసం. మేడమీద రేకుల గదిలోని కిటికీ తెరిచి రోడ్డుమీదకు విసుగులేకుండా చూస్తూనే ఉంది.

అనుకున్నట్లుగానే కారు ఇంటిముందు ఆగింది. సంగీత గుండె దడదడలాడింది. క్షణకాలం సంతోషం, భయం, సంకోచం, దుఃఖం—అన్నీ ఉప్పెనగా వచ్చాయి. పిట్టగోడదాకా పరుగెత్తుకుంటూ వచ్చింది. అక్కడినుంచే చూస్తూ అలానే నివ్వెరపోయింది.

ఆ కారులోనుంచి దిగింది భర్తకాదు. ముసలి సింహం! తనపాలిటి యముడు. అంటే తన ఉత్తరం ఈయన చేతుల్లో పడిందన్నమాట.

ఇప్పు డిక్కడికొచ్చి ఈయన చేయ బోతున్నదేమిటో తెల్సు. ఆయన పరువు మర్యాదలు...వంశగౌరవం... కొడుకు గొప్పదనం...ఔదార్యం... వీటన్నిటినీ కాలదన్ని తను చేసిన ద్రోహం, వంచన గుర్తుచేసి కుళ్ళబొడిచి, చిత్రహింస చేస్తాడు. భగవంతుడా, దీన్ని తను భరించలేదు.

మేడమీదనుంచి ముందుకు వంగింది. క్రిందకు దూకింది.

సరిగ్గా కామేశ్వరరావుగారి పాదాల ముందు ఆమె తల పగిలింది. ముందుకు వంగిన ఆయన కళ్ళవెంట బొట బొట కారిన కన్నీళ్ళు, జివ్వున చిమ్మిన రక్తంలో కల్సిపోతుంటే, అంతదాకా క్రింద ఆడుకుంటున్న బాబు, ఏం జరిగిందో తెలియక ఆశ్చర్యంగా చూస్తున్నాడు.